ఈనాడు ఆదిలాబాద్

ఆదివారం అక్టోబరు 20, 2024 13

కుమురం భీం ఆశయ సాధనకు కృషి



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు

ఉట్నూరు గ్రామీణం, న్యూస్‌టుడే : ఆదివాసీల హక్కుల కోసం పోరాడిన కుమురం భీం ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. శనివారం ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, కుమురం భీం మనవడు సోనేరావు, రాయిసెంటర్ జిల్లా సార్‌మేడి మేస్రం దుర్గు, మాజీ ఎంపీపీ పంద్ర జైవంత్‌రావుతో కలిసి ఉట్నూరు మండలం తాటిగూడలో భీం విగ్రహావిష్కరణలో పాల్గొన్నారు. అనంతరం మాజీ ఎమ్మెల్యేతో పాటు పలువురు ఆదివాసీ సంఘాల నాయకులు మాట్లాడుతూ ఆయన పోరాట ఫలితంగానే మనకు హక్కులు, చట్టాలు దక్కాయని అన్నారు. ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధి కోసం కృషి చేస్తానన్నారు. చంద్రబాను, దశ్వంత్‌రావు, లచ్చు పటేల్, గంగాధర్, జాకు, భగవంత్‌రావు, మోతీరాం, పుష్పరాణి, బాపురావు, తిరుపతి, ప్రభాకర్‌రెడ్డి, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మంత్రికి సన్మానం



మంత్రి తుమ్ములను సన్మానిస్తున్న ఎమ్మెల్యే శంకర్

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే : సోయా కొనుగోళ్ల పరిమితిని ఆరు నుంచి పది క్వింటాళ్లకు పెంచడం పట్ల ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ హర్షం వ్యక్తం చేశారు. శనివారం హైదరాబాద్‌లో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కలిసి రైతుల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఆయన్ను సన్మానించారు. ఇటీవల జైనథ్ మార్కెట్‌యార్డులో రైతుల సమక్షంలో వారి ఇబ్బందులను మంత్రి దృష్టికి తీసుకురాగా.. స్పందించి పరిమితి పెంపు ఉత్తర్వులు జారీ చేయించారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ విషయంలో సహకరించిన ఇన్‌ఛార్జి మంత్రి సీతక్కకు ఎమ్మెల్యే ధన్యవాదాలు తెలిపారు.

జలకాలాట.. ఆరోగ్య బాట

* ఈతపై పెరుగుతున్న ఆదరణ * ఇతర దేశాల్లో పాఠ్యాంశంగా బోధన



ఆదిలాబాద్ ఇందిరా ప్రియదర్శిని క్రీడా ప్రాంగణంలో ఈత కొలనులో చిన్నారుల సాధన

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ క్రీడావిభాగం : రోజూ ఈతకు వెళితే శరీరానికి చక్కటి వ్యాయామం అవుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఫలితంగా ఇటీవల ఉమ్మడి జిల్లాలో ఈతకు ఆదరణ పెరుగుతోంది. కొన్ని ప్రైవేటు కార్పొరేట్ పాఠశాలల్లో మినీ ఈత కొలనులు అందుబాటులో ఉంచి పిల్లలకు శిక్షణ ఇస్తున్నాయి. ఆరోగ్యంపై స్పృహ ఉన్నవారు నేర్చుకుంటున్నారు. వినోదాన్ని, ఆహ్లాదాన్ని పెంపొందించే ఈత విశ్వ క్రీడల్లో అత్యంత జనాదరణ పొందింది. ఇతర దేశాల్లో పాఠ్యాంశంగా బోధిస్తున్నారు. ఈతతో చేకూరే ప్రయోజనాలపై ప్రత్యేక కథనం.

ఉమ్మడి జిల్లాలో ఈత కొలనులు

- ఆదిలాబాద్: 3
- నిర్మల్ : 1
- కుమురం భీం:1
- మంచిర్యాల 4

ఇతర దేశాల్లో..

ఇతర దేశాల్లో ప్రతి ఒక్కరికి ఈత తప్పనిసరిగా వచ్చి ఉండాలనే నిబంధన, చట్టం ఉంది. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు ఈతలో శిక్షణ ఇస్తున్నారు.

* ఇంగ్లాండ్‌లోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు తప్పనిసరిగా ఈత నేర్పిస్తున్నారు. జాతీయ పాఠ్య ప్రణాళికలో శారీరక విద్య చట్టాన్ని పక్కాగా అమలు చేస్తున్నారు.
* ఆస్ట్రేలియాలో ఎక్కువగా బీచ్ సంస్కృతి ఉంది. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఈత నేర్పిస్తామని ధ్రువీకరణ పత్రం రాసి ప్రభుత్వానికి ఇవ్వాలని నిబంధన ఉంది.
* యూఎస్‌లోని పాఠశాలల్లో 6 నుంచి 9వ తరగతుల విద్యార్థులు ఈత నేర్చుకోవడం తప్పనిసరి చేసింది.

నాలుగు విధాలుగా ఈదవచ్చు. ఫ్రీ స్టైల్, బటర్‌ఫ్లై, బ్యాక్ స్ట్రోక్, బ్రెస్ట్ స్ట్రోక్.

బటర్‌ఫ్లై..



అత్యంత కష్టతరమైన ఈత బటర్‌ఫ్లై. నేర్చుకోవడానికి దాదాపు నెలరోజులు పడుతుంది. సీతాకోకచిలుక రెక్కలు ఆడించినట్లుగా రెండు చేతులతో నీటిని లాగుతూ ముందుకు కదలాలి. గంట బటర్‌ఫ్లై ఈత కొడితే 988 కెలరీలు ఖర్చవుతాయి.

బ్రెస్ట్ స్ట్రోక్..



నీటిలో కప్ప ఈదినట్లుగా ఉంటుంది బ్రెస్ట్ స్ట్రోక్ ఈత. రెండు కాళ్లతో నీటిని వెనక్కి నెట్టుతూ, రెండు చేతులు వేగంగా ఛాతి వైపు లాగుతూ ముందుకు వెళ్లే ప్రక్రియ. గంట పాటు సాధన చేస్తే 737 కెలరీలు ఖర్చవుతాయి.

ఫ్రీ స్టైల్..



దీనిని సంప్రదాయ ఈత అని కూడా అంటారు. రెండు వారాల్లో నేర్చుకోవచ్చు. గంట పాటు ఫ్రీ స్టైల్ విధానంలో ఈదితే 590-931 కెలరీలు ఖర్చు అవుతాయి.

బ్యాక్ స్ట్రోక్..



నేలపైన పడుకున్నట్లుగా నీటిపైన తేలుతూ ఈత కొట్టేదే బ్యాక్ స్ట్రోక్. రెండు నెలల్లో నేర్చుకోవచ్చు. ముఖం, కళ్లు ఆకాశం వైపు చూస్తూ శ్వాసను ఏకాగ్రతతో మెల్లగా వదలాలి, తీసుకోవాలి. ఈ క్రమంలో రెండు కాళ్లు చేతులతో నీటిని నెట్టాలి. గంట పాటు చేస్తే 500 కెలరీలు ఖర్చవుతాయి.

ఒత్తిడి దూరం..

- డా.క్రాంతికుమార్, ఎండీ జనరల్ ఫిజిషియన్



ఈత ఆరోగ్యానికి చాలా మంచిది. క్రమం తప్పకుండా రోజూ ఈత సాధనతో శరీరానికి మంచి వ్యాయామం లభిస్తుంది. శ్వాస సంబంధిత వ్యాధులు దరికి చేరవు. హృదయ స్పందన నియంత్రణలో ఉంచుతుంది. శరీరంపైన ఒత్తిడిని తగ్గిస్తుంది.

ఉమ్మడి జిల్లాలో గడిచిన ఏడేళ్లలో ఈత రాక 86 మంది మృత్యువాత పడ్డారు.

* ఊబకాయం ఉన్నవారికి చక్కటి వ్యాయామం.

ఇలా చేస్తే ప్రయోజనాలెన్నో..

* నాలుగు గంటల పాటు నడవడం వల్ల ఎన్ని కెలరీలు ఖర్చవుతాయో గంటపాటు ఈత కొట్టడంతో అంతకన్నా ఎక్కువ కెలరీలు ఖర్చు అవుతాయి.
* చక్కటి నిద్ర పడుతుంది.
* జీర్ణవ్యవస్థ మెరుగుపడి ఆకలి బాగా అవుతుంది.
* రక్తపోటు, మధుమేహం నియంత్రణలో ఉంటాయి.
* గుండె, ఊపిరితిత్తులు, రక్తప్రసరణ, మూత్రపిండాల పనితీరు మెరుగుపడుతుంది.

వీరు దూరంగా ఉండాలి : ఆస్తమా ఉన్నవారు, శస్త్ర చికిత్స అయినవారు, చర్మ వ్యాధులతో బాధపడుతున్నవారు, అవయవ మార్పిడి చేసుకున్నవారు దూరంగా ఉండాలి


ఆసక్తి చూపుతున్నారు..: - కొమ్ము కృష్ణ, ఈత శిక్షకుడు, ఆదిలాబాద్



వేసవి సెలవుల్లో మాత్రమే ఈతకు వచ్చేవారు. ఇప్పుడు నేర్చుకునేవారి సంఖ్య పెరుగుతోంది. రోజూ ఉదయం, సాయంత్రం 50 మంది శిక్షణకు వస్తున్నారు. కొత్తవారు, సాధకులు తప్పనిసరి ఈత శిక్షకులు, నిపుణుల పర్యవేక్షణలోనే నీటిలోకి దిగాలి. పూర్తి పట్టు సాధించాక ఒంటరిగా 8 అడుగుల నీటి లోతులోకి వెళ్లాలి. ధైర్యం ఉన్నవారే ఈతలో రాణించగలుగుతారు.

23 నుంచి పత్తి కొనుగోళ్లు

* మార్కెట్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు



పత్తి విక్రయాలకు సంబంధించి సీసీఐ నిబంధనల ఫ్లెక్సీని ఏర్పాటు చేసిన అధికారులు

న్యూస్‌టుడే, ఆదిలాబాద్ వ్యవసాయం : జిల్లాలో ఈ నెల 23 నుంచి పత్తి కొనుగోళ్లు చేపట్టేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. మద్దతు ధరతో పత్తిని కొనుగోలు చేసేందుకు సీసీఐ సిద్ధంగా ఉందని జిల్లా మార్కెటింగ్ అధికారి గజానన్ తెలిపారు. సీసీఐ నిబంధనల మేరకు పత్తిలో తేమ శాతం 8 ఉంటే మద్దతు ధర లభిస్తుందని ఆయన తెలిపారు. 12 శాతం కంటే తేమ ఎక్కువగా ఉంటే రైతులు ఇబ్బందులు పడే అవకాశం ఉందని, పత్తిని ఆరబెట్టుకొని తీసుకొస్తే త్వరగా పత్తిని విక్రయించుకోవచ్చని ఆయన తెలిపారు.

పత్తి కొనుగోళ్లలో ఏర్పడే ఇబ్బందులు, సమస్యలను పరిష్కరించేందుకు వీలుగా అయిదుగురు సభ్యులతో మల్టీ కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు జిల్లా మార్కెట్ అధికారి గజానన్ తెలిపారు. వ్యవసాయశాఖ నుంచి ప్రసాద్, మార్కెట్‌శాఖ నుంచి స్వామి, సీసీఐ తరపున ప్రవీణ్, తూనికలు కొలతల శాఖ నుంచి నవీన్‌కుమార్, రవాణా శాఖ నుంచి జయవంత్ రాథోడ్‌లు కమిటీలో ఉంటారని, పత్తి క్రయవిక్రయాల్లో ఏర్పడే సమస్యలను కంట్రోల్ రూమ్ దృష్టికి తీసుకెళితే సమస్యను పరిష్కరిస్తారని ఆయన తెలిపారు.

14 కేంద్రాల్లో కొనుగోలు..

జిల్లాలో రైతుల నుంచి పత్తిని కొనుగోలు చేసేందుకు సీసీఐ 14 కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఆదిలాబాద్ పట్టణంలో రెండు, బోథ్‌లో మూడు జిన్నింగ్‌లో పత్తి కొనుగోలు చేస్తారు. నేరడిగొండ, పొచ్చెర, సొనాల, ఇచ్చోడ, మన్నూర్, గుడిహత్నూర్, ఇంద్రవెల్లిలో మూడు, నార్నూర్‌లో రెండు జిన్నింగుల్లో పత్తి కొనుగోళ్లు ఉంటాయని సీసీఐ నోటిఫై చేసింది. పత్తి విక్రయాల్లో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సీసీఐ నిబంధనలు తదితర వాటిని రైతులు తెలుసుకునేందుకు వీలుగా కొనుగోలు కేంద్రాల వద్ద ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. ఆయా జిన్నింగ్ మిల్లులతో ఒప్పందాలు పూర్తి చేసుకోవడంతో పాటు ఇతర ఏర్పాట్లు పూర్తి చేసుకున్నారు. సీసీఐకి పత్తిని విక్రయించే రైతులు ఆధార్‌కార్డు, పట్టాపాసుబుక్ నకలు ప్రతులను తీసుకొని రావాల్సి ఉంటుంది. గతంలో మాదిరిగా కాకుండా ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల్లోగా పత్తి కొనుగోళ్లు ఉంటాయి. సాయంత్రం ఆరుగంటల్లోగా పూర్తి చేయాల్సి ఉండటంతో మధ్యాహ్నం రెండు గంటల్లోపు లోడ్ బళ్లు ఆ తర్వాత ఖాళీ బళ్లు తూకం వేస్తారని మార్కెట్ అధికారులు తెలిపారు.

నిధులు మింగిన ఘనులు

* చెక్‌డ్యాంల నిర్వహణపై పర్యవేక్షణ లేమి



ఈటీవీ - ఆదిలాబాద్: ఒకప్పుడు నీటి చుట్టూ నాగరికత ప్రాణం పోసుకుంటే ఇప్పుడు రాజకీయ గ్రహణం పట్టిపీడిస్తోంది. సాగునీటి వసతి కల్పించటం, భూగర్భ జలాల పెంపునకు ప్రభుత్వం కేటాయించే రూ.కోట్ల చెక్‌డ్యాం పనుల నిర్వహణ అక్రమార్కులకు ఊతమిచ్చేలా సాగుతోంది. ప్రజాప్రతినిధుల జోక్యంతో అధికారుల అజమాయిషీ లేకుండా పోతోంది. నిధులు నీళ్లలా ఖర్చవుతున్నాయే తప్ప ఆశించిన ప్రయోజనం చేకూరడం లేదు.

రాష్ట్రంలో అత్యధిక వర్షపాతంతో పాటు గుట్టలు, నదులు, వాగులు, సెలయేళ్లతో సహజసిద్ధమైన భౌగోళిక స్థితిగతులతో పెనవేసుకున్న ఉమ్మడి జిల్లాలో పొలాలకు సాగునీటి లభ్యత అందని ద్రాక్షగానే మిగిలిపోతోంది. చెక్‌డ్యాంల నిర్వహణ అస్తవ్యస్తంగా మారుతోంది. నాలుగేళ్లలో ప్రభుత్వం ఉమ్మడి జిల్లాకు 157 చెక్‌డ్యాంలు మంజూరు చేసింది. ఒక్కో చెక్‌డ్యాంకు రూ.2 కోట్లను పరిగణనలోకి తీసుకుంటే రూ.314 కోట్లు మంజూరు చేసింది. ఇందులో ఒక్క ఆదిలాబాద్ జిల్లాలోనే మొదటి దశలో రూ.120 కోట్లు, రెండో దశలో రూ.45 కోట్లు మంజూరు చేసింది. ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల్లో చాలాచోట్ల పనులు పూర్తి చేయకుండానే చేసినట్లుగా సర్దుబాటు చేస్తున్నట్లు తెలుస్తోంది. కరోనా కారణంగా మొదటి దశ పనుల నిర్వహణ కొంతమంది ప్రజాప్రతినిధులు, అధికారుల ఇష్టాయిష్టాలతోనే జరిగింది. రెండో దశలో మంజూరైన వాటిలో ఇప్పటికీ చాలా చోట్ల ప్రారంభమే కాలేదు.

రెండు దశల్లో మంజూరైన చెక్‌డ్యాంలు

జిల్లా	మొదటిదశ	రెండోదశ
ఆదిలాబాద్	54	16
ఆసిఫాబాద్	09	11
మంచిర్యాల	16	08
నిర్మల్	23	21

ప్రమాదానికి హేతువు

ఇది భీంపూర్ మండలంలోని ధనోర వాగుపై అంతర్రాష్ట్ర వంతెనను ఆనుకొని రైతుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా నిర్మించిన చెక్‌డ్యాం. రూ.1.70 కోట్లు ఖర్చయినా ఫలితం లేదు. పైగా వర్షాకాలంలో వాగు ఉద్ధృతితో వెనుక జలాలు వంతెనపైకి వచ్చే నీటి ప్రవాహంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది.



☛ ఆదిలాబాద్ మండలం యాపల్‌గూడలో నాణ్యత ప్రమాణాలు పాటించకుండా నిర్మించిన చెక్‌డ్యాం నిరుపయోగంగా మారింది. వేసవిలో నీరే ఉండటం లేదు.

ఖాళీలే..

మంచిర్యాల జిల్లాలో కీలకమైన ఎస్ఈ పోస్టు కనీసం ఇన్‌ఛార్జి బాధ్యతల్లేకుండా ఖాళీగానే ఉంది. నెల, రెండు నెలల్లో పదవీ విరమణ చేసే డీఈఈలను పదోన్నతిపై ఇన్‌ఛార్జి ఎస్ఈగా నియమించే పద్ధతి సాగుతోంది. అయిదు నెలల కిందట జి.శ్రీనివాస్‌రెడ్డి పదవీ విరమణ చేశారు. ఆయన స్థానంలో ఇన్‌ఛార్జి ఎస్ఈగా వచ్చిన మురళీధర్ జూన్ 30న, తర్వాత ఇన్‌ఛార్జిగా నియమితులైన శివకుమార్ జులై 30న, మళ్లీ ఇన్‌ఛార్జిగా బాధ్యతలు చేపట్టిన కొంతం శ్రీనివాస్ సెప్టెంబరు 30న పదవీ విరమణ చేశారు. ఇప్పుడు కనీసం ఇన్‌ఛార్జి కూడా లేరంటే పనుల పర్యవేక్షణ అర్థం చేసుకోవాల్సిందే..

* ఇంద్రవెల్లి, బోథ్, సిరికొండ, జైనూర్, బెజ్జూర్ మండలాల పనులపై ఇంజినీర్లు ఇచ్చిందే పనులు ఉన్నట్లుగా నడుస్తోంది.
* ఆదిలాబాద్ ఎస్ఈ రామును 'ఈనాడు' సంప్రదిస్తే వివరాలేమీ నాకు తెలియదు. అంతా ఈఈ, డీఈల దగ్గరే ఉంటుందని వివరించటం విశేషం.

భోజనశాల పూర్తయ్యేదెప్పుడో?



ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాల బాలికలు కింద కూర్చునే భోజనాలు చేస్తున్నారు. 2014లో రూ.25 లక్షలతో పనులు ప్రారంభించారు. నేటికీ పనులు పూర్తి కాలేదు. అక్కడ పిచ్చి మొక్కలు సైతం పెరిగాయి. ఫలితంగా విద్యార్థులు అవస్థల నడుమ భోజనాలు చేస్తున్నారు. ఈ విషయమై ఏఈఈ సతీష్‌ను వివరణ కోరగా.. గుత్తేదారు టెండరును రద్దు చేయాలని ప్రభుత్వానికి లేఖలు పంపించామన్నారు. రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ నుంచి అనుమతి రాగానే తిరిగి టెండర్లు పిలిచి పనులు ప్రారంభించి పూర్తి చేస్తామన్నారు. - న్యూస్‌టుడే, ఇంద్రవెల్లి

తొలి వేతన బిల్లుపై సందిగ్ధం

బోథ్, న్యూస్‌టుడే : ఇటీవల కొత్తగా విధుల్లో చేరిన ఉపాధ్యాయులకు తొలి వేతన బిల్లుపై సందిగ్ధత నెలకొంది. ఎంఈవో పదవీ విరమణ పొందడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. పక్షం రోజులు దాటినా ఎంఈవోగా ఎవరికి బాధ్యతలు అప్పజెప్పలేదు. ఫలితంగా కొత్తగా నియామకమైన 18 మంది ఎస్జీటీల, మరో తొమ్మిది మంది స్కూల్ అసిస్టెంట్ల వేతన బిల్లు ప్రొసీడింగ్ జారీ కాక వారి తొలి వేతనాలు నిలిచిపోయే పరిస్థితి నెలకొంది. ప్రాన్, ఎంప్లాయి ఐడీ వంటివి జారీ చేయడం మరింత ఆలస్యమై సప్లిమెంటరీ వేతన జాబితాలోకి తమ బిల్లులు చేరిపోతాయనే ఆందోళన వారిని వెంటాడుతోంది. ట్రెజరీలో వేతన బిల్లు సమర్పణకు మరో అయిదు రోజుల గడువు మిగిలి ఉండటంతో ఉన్నతాధికారులు తగుచర్యలు తీసుకోవాలని సంబంధీకులు కోరుతున్నారు.

ఉట్నూరులో వర్షం

ఉట్నూరు గ్రామీణం, న్యూస్‌టుడే : ఉట్నూరు మండలంలో శనివారం వర్షం కురవడంతో మొక్కజొన్న పంట చేతికొచ్చిన రైతులు ఇబ్బందులు పడ్డారు. దంతనపల్లికి చెందిన రైతు రాజేశ్వర్‌కు చెందిన 20 క్వింటాళ్ల మొక్కజొన్న పంట మొత్తం తడిసిపోయింది. కొనుగోలు కేంద్రాలు లేక నష్టపోతున్నామని స్థానిక రైతులు వాపోయారు. ప్రభుత్వం ఉట్నూరు మండలంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

అధికారులొస్తేనే.. యంత్రాలకు పని



రైల్వే స్టేషన్‌లో నిరుపయోగంగా గచ్చు శుభ్రం చేసే యంత్రాలు

రైల్వే ప్లాట్‌ఫాంతో పాటు పరిసర ప్రాంతాలను శుభ్రం చేయటానికి రైల్వే శాఖ ఆధునిక యంత్రాలను కొనుగోలు చేసి సరఫరా చేసింది. ఆదిలాబాద్‌కు సైతం రూ.లక్షల విలువైన మూడు యంత్రాలను అందుబాటులోకి తీసుకొచ్చింది. వీటి నిర్వహణ బాధ్యతను గుత్తేదారుకు అప్పగించారు. గుత్తేదారు మాత్రం వాటి ద్వారా అప్పుడప్పుడు మాత్రమే శుభ్రత పనులు చేయిస్తున్నారు. ఉన్నతాధికారులు వచ్చినప్పుడు మాత్రం యంత్రాలతో పాటు పారిశుద్ధ్య కార్మికులతో ఆ ప్రాంతమంతా శుభ్రం చేయిస్తుంటారు. మిగతా సమయాల్లో ఇలా మూలన పడి ఉంటాయి.

- ఈనాడు, ఆదిలాబాద్
- న్యూస్‌టుడే, ఎదులాపురం

ఐటీడీఏ సమావేశాల ఊసేది?

* అయిదేళ్లవుతున్నా పట్టించుకోని వైనం



ఉట్నూరు ఐటీడీఏ కార్యాలయం

న్యూస్‌టుడే, ఇంద్రవెల్లి: సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ(ఐటీడీఏ) పాలకవర్గం ప్రతి ఆరు నెలలకోసారి సమావేశమై ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనుల సమస్యలు.. మౌలిక సదుపాయాల కల్పనపై చర్చించాలి. ఉట్నూరు ఐటీడీఏలో ఈ సమావేశాల నిర్వహణ ఊసెత్తడమే లేదు. చివరిసారిగా 2019 అక్టోబరు 30న నిర్వహించారు. దాదాపు అయిదేళ్లవుతున్నా సమావేశం గురించి పట్టించుకోవడమే మానేశారు.

ప్రతి ఆరు నెలలకోసారి ఎంపీపీలు, జడ్పీటీసీ సభ్యులతో పాటు జిల్లాస్థాయి అధికారుల సమక్షంలో పాలకవర్గ సమావేశాన్ని నిర్వహించాలి. సమావేశానికి జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీఓ, సబ్ కలెక్టర్‌తో పాటు ఎమ్మెల్యేలు, ఎంపీలు, జిల్లా మంత్రితో పాటు ఎమ్మెల్సీలు హాజరవుతారు. భారాస ప్రభుత్వం అధికారంలో ఉన్న సమయంలో సమావేశాన్ని నిర్వహించలేదు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం 10 నెలలైనా సమావేశంపై దృష్టి సారించలేదు.

అవకాశమే రాలేదు.. : - గోడం నగేష్, ఎంపీ, ఆదిలాబాద్



అయిదేళ్లుగా సమావేశాలు లేకపోవడంతో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఏజెన్సీ మండలాల నుంచి ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన ఎంపీపీలు, జడ్పీటీసీ సభ్యులకు అయిదేళ్ల పదవి కాలంలో గిరిజనుల సమస్యలను ప్రభుత్వంతో పాటు అధికారుల దృష్టికి తీసుకెళ్లే అవకాశమే రాలేదు. జిల్లా పరిషత్ సమావేశాలలో సైతం గిరిజన ప్రజాప్రతినిధులకు సమస్యలను ప్రస్తావించే అవకాశం కల్పించలేదు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఐటీడీఏ పాలకవర్గ సమావేశాన్ని నిర్వహించి గిరిజనుల సమస్యల పరిష్కారానికి మార్గం చూపాలి.

గోడు వినిపించుకోవడం లేదు

- పుర్కా బాపురావు, తుడుందెబ్బ జిల్లా అధ్యక్షుడు



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనుల అభివృద్ధికి రూ.కోట్లు ఖర్చు చేస్తున్నట్లు ప్రకటిస్తున్నారే తప్ప గిరిజనులకు మౌలిక వసతులు కల్పించడం లేదు. మారుమూల గిరిజన గ్రామాలకు నేటికీ కనీసం రవాణా సౌకర్యం లేక నానా ఇబ్బందులు పడుతున్నారు. ఐటీడీఏ పాలక వర్గ సమావేశం నిర్వహిస్తే గిరిజనుల సమస్యలు తెలుస్తాయి. భారాస ప్రభుత్వం పట్టించుకోలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలైనా దృష్టి సారించడం లేదు.

పెద్ద జొన్న పంట రక్షణకు పాట్లు



పక్షులు తినకుండా కవర్‌ను కడుతున్న గిరిజన రైతు టేకం రావుజీ

ఏజెన్సీ ప్రాంతంలో గిరిజన రైతులు సాగు చేసే పెద్ద జొన్న పంట 20 ఏళ్ల కిందట కనుమరుగైంది. పెద్ద జొన్న పంటను రాబోయే తరానికి అందించాలనే ఉద్దేశంతో గిరిజన రైతులు విత్తనాలను రక్షించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. ఆదిలాబాద్ గ్రామీణ మండలం మొలాల్‌గుట్టకు చెందిన కొలాం గిరిజన రైతు టేకం రావుజీ పంటను పక్షుల నుంచి కాపాడుకునేందుకు కంకులకు ప్లాస్టిక్ కవర్లు కడుతున్నారు. - న్యూస్‌టుడే, ఇంద్రవెల్లి

కలెక్టర్‌ను కలిసిన కౌన్సిలర్లు

పాలనాప్రాంగణం: పాలనాధికారి రాజర్షిషాను కాంగ్రెస్ వార్డు కౌన్సిలర్లు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన్ను సన్మానించి దసరా శుభాకాంక్షలు తెలిపారు. కౌన్సిలర్లు జహీర్ రంజానీ, శ్రీనివాస్, బండారి సతీష్, చంద నర్సింగ్, వెంకన్న పాల్గొన్నారు.

తాటిచెట్టుపై పిడుగుపాటు

హాజీపూర్, న్యూస్‌టుడే : మండలంలో శనివారం రాత్రి ఈదురుగాలులు, ఉరుములు, పిడుగులతో కురిసిన అకాల వర్షానికి ప్రజలు, రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మండలంలోని పెద్దంపేటలో బొప్పు ఎల్లయ్య ఇంటి సమీపంలో ఓ తాటిచెట్టుపై పిడుగు పడి మంటలు చెలరేగడంతో గ్రామస్థులు ఆందోళనకు గురయ్యారు. పిడుగు పడే సమయంలో ఆ ప్రాంతంలో ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. కాగా మండలంలోని పెద్దంపేట, దొనబండ, టీకనపల్లి, హాజీపూర్ తదితర గ్రామాల్లో భారీ వర్షం కురిసింది.


పిడుగుపాటుకు చెలరేగుతున్న మంటలు

చెరువా.. తామర వనమా



తోటలో పూల సాగు చేసినట్లు కనిపిస్తున్న ఈ దృశ్యం కడెం మండలం కన్నాపూర్ చెరువులోనిది. ఇక్కడి చెరువు నిండా తామరపూలు పూస్తున్నాయి. ఇటీవల దేవీ నవరాత్రులు, బతుకమ్మ పండగకు చాలామంది ఇక్కడి తామరపూలను కోసుకెళ్లారు. చెరువులో ఇలా రోజూ పూలు పూస్తుండటంతో తామర పూల తోటలా కనిపిస్తోంది. నిర్మల్-మంచిర్యాల రహదారిని ఆనుకుని ఉన్న ఈ చెరువులోని తామరలు కనువిందు చేస్తున్నాయి. - కడెం, న్యూస్‌టుడే

కల్లు గీతకు తి(తె)ప్పలు


తెప్పపై వెళ్లి కల్లుగీయడానికి చెట్టు ఎక్కుతున్న గీతకార్మికుడు

థర్మకోల్ తెప్పలతో సాధారణంగా గంగపుత్రులు చేపల వేట కొనసాగిస్తారు. కానీ నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలం బన్సపల్లి శివారులోని గోదావరి నది శ్రీరామ్‌సాగర్ ప్రాజెక్టు వెనుక జలాలు సమీపంలో కొన్ని తాటి, ఈత చెట్లు జలమయం కావడంతో కల్లుగీత కార్మికులు తెప్పల సాయంతో కల్లు సేకరించి జీవనోపాధి పొందాల్సి వస్తోంది. ఏటా గోదావరి జలాలు పూర్తిస్థాయిలో నిండటంతో నీరు తగ్గేవరకు సముందర్‌పల్లి, గుండంపల్లి, టెంబుర్ని గ్రామాల్లోని పలువురు గీతకార్మికులు చెట్ల వద్దకు వెళ్లడానికి తప్పనిసరిగా తెప్పలు వాడాల్సి వస్తోంది.
- న్యూస్‌టుడే, దిలావర్‌పూర్


బన్సపల్లిలో తెప్పపై కల్లుకుండతో వస్తూ...

రైతు బిడ్డలు.. వ్యవసాయాధికారులు

● కర్షకుల ఇంట కొలువుల పంట

మామడ, న్యూస్‌టుడే:

వ్యవసాయమే ఆధారంగా జీవించే రైతుల పిల్లలు ప్రయోజకులై కొలువులు సాధిస్తే అంతకు మించిన ఆనందం ఇంకోటి ఉండదు. అనేక ప్రతికూల పరిస్థితులను తట్టుకొని ఏడాదికి ఒకటీ రెండు పంటలు పండించే కుటుంబాల్లో నెలకో దిగుబడి వస్తే ఎంతో ఆనందంగా ఉంటుంది. ఇటీవలే విధుల్లో చేరిన ఈ యువ వ్యవసాయాధికారులది పక్కా కర్షక కుటుంబం. బాల్యం నుంచే తల్లిదండ్రులతో పాటు సాగు పనులు చేసిన అనుభవం వారిది. పాతికేళ్ల వయసులోనే రెండు మూడు ఉద్యోగాలు సాధించి ఇప్పుడు ఏకంగా ఓ మండలానికి అధికారిగా గెజిటెడ్ హోదా పొందిన ఇద్దరు యువకుల నేపథ్యమిదీ...


వ్యవసాయ పనుల్లో నవీన్ తల్లిదండ్రులు బన్సి-కళ

తండా కుర్రోడి తడాఖా..

మామడ మండలం లింగాపూర్ తండాకు చెందిన నునావత్ బన్సి-కళ దంపతుల కుమారుడు నవీన్. ప్రస్తుతం ఈయన పెంబి మండల వ్యవసాయాధికారిగా బాధ్యతలు స్వీకరించారు. రాజేంద్రనగర్ వ్యవసాయ కళాశాలలో ఏజీ బీఎస్సీ మొదటి సంవత్సరంలోనే అనారోగ్యం వల్ల చదువుకు ఆటంకం కలిగింది. డిగ్రీ పూర్తయ్యేందుకు ఓ ఏడాది ఆలస్యమైంది. ఈ క్రమం ఆయనను కొంత కుంగుబాటుకు గురిచేసింది. ఆత్మవిశ్వాసం కూడగట్టుకొని పట్టు సడలన్వకుండా మంచి మార్కులతో ఉత్తీర్ణులయ్యారు. ఆ వెంటనే బ్యాంకు ఉద్యోగాల కోసం శిక్షణకు వెళ్లారు. అనేక పోటీ పరీక్షలు రాశారు. తొలి ఉగ్యోగం యూనియన్ బ్యాంకులో గ్రామీణాభివృద్ధి అధికారిగా ఆంధ్రప్రదేశ్‌లో వచ్చింది. ఆ తర్వాత ఎఫ్‌సీఐలో మంచి హోదా గల అధికారిగా ఎంపికైనా బ్యాంకు కొలువులోనే కొనసాగారు.

నవీన్ ఏమంటున్నారంటే..

చిన్నప్పటి నుంచి అమ్మానాన్నల కష్టం చూశాను. రెక్కలు ముక్కలు చేసుకొని చదివించారు. ఎలాగైనా వారి కష్టాలను గట్టెక్కించాలన్న కసితో ముందుకెళ్లాను. పోటీ పరీక్షల్లో రాణించాలంటే సాదాసీదా ప్రయత్నాలతో పని కాదు. పట్టుదల, ప్రణాళిక చాలా ముఖ్యం. సమయం ఎంతో కీలకం. ఎక్కడా వృథా చేయొద్దు. ఏ పరీక్ష రాసినా పాత ప్రశ్నాపత్రాల సాధన బాగా చేయాలి. పెద్ద లక్ష్యం పెట్టుకుంటే ఏదో ఒకటి తప్పకుండా సాధించొచ్చు.





తల్లిదండ్రుల నర్సవ్వ-మాణిక్‌రావుతో పొలం పనుల్లో గిరిరాజ్

పట్టుదలే పెట్టుబడిగా..

దిలావర్‌పూర్‌కు చెందిన నర్సవ్వ-మాణిక్‌రావు దంపతుల కుమారుడు గిరిరాజ్ తాజాగా లోకేశ్వరం వ్యవసాయాధికారిగా నియామకమయ్యారు. అశ్వరావుపేట వ్యవసాయ కళాశాలలో ఏజీ బీఎస్సీ పూర్తి చేశారు. కేరళ వ్యవసాయ శాఖలో పీజీ చేసేందుకు అవకాశం వచ్చినా ఉద్యోగం సాధించాలన్న తపనతో అనేక పోటీ పరీక్షలు రాశారు. ఇఫ్కోలో మేనేజరుగా ఎంపికై గద్వాలలో పనిచేశారు. ఇంకా మంచి స్థానానికి చేరుకోవాలన్న లక్ష్యంతో గ్రూప్స్, ఎస్సై ఎంపిక పరీక్షలకు సన్నద్ధమయ్యారు. ఈ క్రమంలో ఏవో ఉద్యోగం సాధించి వ్యవసాయాధికారి అయ్యారు.

విజయానికి దగ్గరి దారులు ఉండవు: గిరిరాజ్

తల్లిదండ్రులు ఉద్యోగులైతే ఆర్థికంగా అంత ఇబ్బందులుండవు. పరిస్థితులు అనుకూలిస్తాయి. రైతు కుటుంబాలకు కాస్త భారమే అవుతుంది. ఈ పరిస్థితులను దగ్గరగా చూసి ఎలాగైనా ప్రయోజకుడినై అమ్మానాన్నలను సంతోష పెట్టాలన్న తపన నిత్యం మదిలో మెదిలేది. ఏదైనా సాధించే వరకు ప్రయత్నం ఆపొద్దన్న లక్ష్యం పెట్టుకున్నాను. ఏ విజయం సాధించాలన్న దానికి దగ్గరి దారులంటూ ఏవీ ఉండవు. నిరంతర ప్రయత్నంతోనే ఫలితం వస్తుంది. చాలా మంది ఉద్యోగ ప్రకటన విడుదలయ్యాకే చదవడం మొదలు పెడుతారు. ఎంతో మంది ప్రతిభావంతులున్న ఈ పోటీ ప్రపంచంలో పైపై ప్రయత్నాలతో విజయం కష్టమే.. ఎస్సై, గ్రూప్స్‌కు ముందు నుంచే సన్నద్ధం కావడంతో ఆ పరిజ్ఞానం ఏవో పరీక్షలో నాకు ఉపయోగపడింది.



ఆలోచనలు పరుగెత్తేలా.. నడిచే ప్రయోగశాల

న్యూస్‌టుడే, ఆసిఫాబాద్ అర్బన్

శాస్త్ర సాంకేతికత కొత్త పుంతలు తొక్కుతున్న ప్రస్తుత రోజుల్లో పాఠశాల నుంచే విద్యార్థుల్లో ఆ ఒరవడి సృష్టించాల్సిన అవసరముంది. వసతుల లేమితో కొట్టుమిట్టాడుతున్న ప్రభుత్వ పాఠశాలల్లో ప్రయోగశాలలు ఆశాజనకంగా లేకున్నా.. అత్యాధునిక వసతులు, పరికరాలతో కూడిన సంచార సైన్స్ ల్యాబ్ వాహనాన్ని భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బీహెచ్‌ఈఎల్) సంస్థ కుమురంభీం జిల్లాకు ప్రత్యేకంగా సమకూర్చింది. గదుల్లో నేర్చుకున్న భౌతిక, రసాయన సిద్ధాంతాలు, వివిధ సూత్రాలను ప్రయోగాలతో అవగాహన కలిగించే అవకాశం ఉండటంతో.. విద్యార్థులకు ఇది ఎంతో ఉపయుక్తంగా మారనుంది. మంత్రి సీతక్క ఈ నెల 16న ఆసిఫాబాద్‌లో దీన్ని ప్రారంభించారు.

● ప్రత్యేకంగా కుమురంభీం జిల్లా విద్యార్థులకు కేటాయింపు

రూ.80 లక్షలతో ఈ సంచార వాహనాన్ని అత్యాధునికంగా తీర్చిదిద్దారు. సెంట్రల్ ఏసీ, ప్రొజెక్టర్, స్క్రీన్, జనరేటర్, శౌచాలయంతో పాటు పాఠశాలల్లోని ల్యాబ్‌లకు భిన్నంగా ప్రయోగ పరికరాల ప్రదర్శన, భద్రపరిచే ఏర్పాట్లు ఉన్నాయి. తెలిసిన విషయాలనే వివిధ పరికరాలతో ఆసక్తికరంగా చూపిస్తూ విద్యార్థుల్లో తెలుసుకోవాలన్న ఆలోచన కలిగేలా పొందుపర్చారు. అయితే ఈ వాహనానికి డ్రైవర్, హెల్పర్, ఇంధనం తదితర ఖర్చుల కోసం ప్రభుత్వం నిధులు కేటాయించాల్సి ఉంది.


సంచార సైన్సు ప్రయోగశాల బస్సు


సంచార సైన్సు ప్రయోగశాలలో భౌతిక, జీవ, గణితశాస్త్రాల ప్రయోగాలు, నమూనాలతో సైన్సు విషయ నిపుణులు

మ్యాజిక్ మయం..

వాహనంలో మ్యాజిక్ తలపించే ప్రయోగాల ప్రదర్శన ఆకట్టుకుంటుంది. మ్యాజిక్ వాటర్ ట్యాప్, న్యూటన్ ఊయల, జడత్వ నియమం, చర్య ప్రతిచర్య, పంజరంలో చిలుక, గుర్రపు చట్రం, పీడన చట్రం, గాలిలో అయస్కాంతం, తదితర భౌతిక, రసాయన, జీవ, గణిత ప్రయోగాలు అద్భుత భావనలు దృశ్య భ్రాంతిని కలిగిస్తాయి.

మ్యాజిక్ వాటర్ ట్యాప్

ఎలాంటి ఆధారం లేకుండానే కుళాయి ఏర్పాటు, అందులోంచి నీరు కిందకు పడుతున్నట్లు కనిపించే ఈ మ్యాజిక్ వాటర్ ట్యాప్ ఆసక్తి కలిగిస్తుంది.



న్యూటన్ ఊయల

వేలాడదీసిన లోలక గుండ్లలో.. ఒక దాన్ని లాగి వదిలితే అవతలి వైపున్న ఒక గుండు అంతే వేగంతో కదులుతుంది. మిగతావి కదలవు. అలానే రెండు, మూడు లాగి వదిలినా.. సమాన సంఖ్యలో అవతలి గుండ్లు కదులుతాయి. న్యూటన్ నియమాల ఆధారంగా ఇది పనిచేస్తుంది.




పీడన చట్రం

చిలుక, గుర్రం..

ఒక చట్రం పైభాగాన ఓ వైపు చిలుక చిత్రం, మరోవైపు పంజరం చిత్రాన్ని ఉంచి చట్రాన్ని గిరగిరా తిప్పితే.. పంజరంలో చిలక ఉన్న భ్రాంతి కలుగుతుంది. అలాగే చట్రంలోని గుర్రపు బొమ్మ సైతం తిప్పినపుడు ముందుకు పరుగెడుతున్నట్లు కనిపిస్తుంది.



ముందుగా ఉపాధ్యాయులకు శిక్షణ

- కటుకం మధుకర్, జిల్లా సైన్సు అధికారి



సంచార ప్రయోగశాల జిల్లాకు కేటాయించడం అభినందనీయం. అత్యాధునిక భావనలు, సౌకర్యాలతో ఉన్న ఈ ప్రయోగశాలను జిల్లాలోని అన్ని ఉన్నత పాఠశాలల వద్దకు తీసుకుపోయి వీలైనంత త్వరగా విద్యార్థులకు అవగాహన కల్పిస్తాం. ముందుగా సైన్సు ఉపాధ్యాయులకు దీనిపై శిక్షణనిస్తాం. ఇందుకోసం ప్రత్యేక కార్యాచరణ రూపొందించాం.

వేడి పుట్టించవు.. మంటలు రావు

వీధి దీపాల్లా కనిపిస్తున్న ఈ లైట్లు సాధారణమైనవి కావు. సాధారణ వీధి దీపాలు వేడిని పుట్టిస్తాయి. ఆదిలాబాద్ జైలు బంకు సమీపంలో త్వరలో ప్రారంభించనున్న సీఎన్‌జీ గ్యాస్ స్టేషన్ వద్ద జిల్లాలోనే మొదటి సారి ఈ అన్‌ఫ్లేమ బుల్ లైట్లను ఏర్పాటు చేశారు. ఇవి సాధారణ దీపాలకు భిన్నంగా ఉంటాయి. వీటి వల్ల అక్కడ ఉష్ణోగ్రతలు పెరగదు. ఒక్కోదానికి రూ.5,500 ఉంటుంది. సీఎన్‌జీ గ్యాస్ పంపుల వద్ద వీటిని ఏర్పాటు చేస్తారు. ఒక వేళ పొరపాటున గ్యాస్ లీక్ అయినా మంటలంటుకోవు.
- ఈనాడు, ఆదిలాబాద్ - న్యూస్‌టుడే, ఆదిలాబాద్ నేర విభాగం



జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు లక్ష్మణ్‌సాయి



మంచిర్యాల క్రీడావిభాగం, న్యూస్‌టుడే : పాఠశాల క్రీడా సమాఖ్య జాతీయ స్థాయి పోటీలకు జిల్లా క్రీడాకారుడు ఎంపికయ్యాడు. ఇటీవల జరిగిన జిల్లా, రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీల్లో మెరుగైన ఆటతీరును కనబరుస్తూ నిలకడగా రాణిస్తున్న వేములపల్లి లక్ష్మణ్‌సాయి తెలంగాణ జట్టులో చోటు దక్కించుకున్నాడు. త్వరలో బిహార్‌లో జరగనున్న ఆయా పోటీల్లో పాల్గొననున్నాడు. లక్ష్మణ్ ప్రస్తుతం మంచిర్యాల కేంద్రీయ విద్యాలయంలో తొమ్మిదో తరగతి చదువుతుండగా స్థానిక గురు క్రికెట్ అకాడమీలో శిక్షకుడు దుర్గాప్రసాద్ సమక్షంలో శిక్షణ తీసుకుంటున్నాడు.

మొలకలు.. కాస్త భిన్నంగా



న్యూస్‌టుడే, మంచిర్యాల సిటీ: ఆరోగ్యకరమైన అలవాట్లను జిల్లా కేంద్రానికి పలువురు రోజుకో రకంగా పరిచయం చేస్తున్నారు. ఇటీవల కాలంలో గ్రీన్, లెమన్, బెల్లం టీ, చిరుధాన్యాల జావ ఇలా అనేక రకాల ఆరోగ్యాన్ని పెంచే కేంద్రాలను అందుబాటులో తీసుకొచ్చారు. ప్రజలు సైతం వీటిని తీసుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రస్తుతం మంచిర్యాల పట్టణానికి మరోరకం ఆరోగ్యకరమైన ఆహారాన్ని తాగేది కాకుండా తినే పదార్థం వినియోగంలోకి తీసుకొచ్చారు. చెన్నూరుకు చెందిన రాజు అనే యువకుడు కాస్త వినూత్నంగా పరిచయం చేస్తున్నాడు. హెల్తీ, స్పైసీ మొలకలంటూ కాస్త భిన్నంగా అప్పటికప్పుడు సిద్ధం చేసి అందిస్తున్నారు. హంగు, ఆర్భాటాలు లేకుండా మిర్చి బండి మాదిరిగా ఏర్పాటు చేసి జిల్లావాసుల ఆరోగ్యాన్ని పంచు(పెంచు)తున్నారు.


కాస్త రుచికరంగా ఇలా సిద్ధం చేస్తూ..

మొలకలు (ఉలవలు, మొక్కజొన్న, పెసర్లు, ఎర్ర పెసర్లు, బబ్బర్లు, శనగలు, పల్లీలు) ఆరోగ్యానికి మంచిందంటారు. కొంతమంది వీటితోనే దినచర్య ప్రారంభిస్తారు. ఎప్పటినుంచో అందుబాటులో ఉన్నా ప్రస్తుతం ఆరోగ్యకరమైన అలవాట్లు పెరగడంతో వీటికీ మరింత ప్రాధాన్యం పెరిగింది. కొందరు కాస్త ఓపికతో వారి వారి నివాసాల్లోనే విత్తనాలను రాత్రి నానబెట్టి మొలకెత్తిన అనంతరం పచ్చివే ఉదయం తింటుంటారు. వీటిని తినడం ఆరోగ్యానికి మంచిదే అని తెలిసినా పచ్చివి తినాలంటే కొంతమంది ఇబ్బంది పడుతుంటారు. వారి కోసమే ఈ బండిని అందుబాటులోకి తీసుకొచ్చినట్లుగా ఉంది. వేసివేయనట్లుగా నూనె, కాస్త ఉప్పు, కారంతో ఫ్రై చేస్తున్నారు. చివరగా కొంత నిమ్మరసం కలిసి ఆహా అనేలా రుచికరంగా సిద్ధంచేసి విక్రయిస్తున్నారు.

కవ్వాల్‌లో కలియ తిరిగి.. అందాలు తిలకించి...!


అటవీశాఖ అధికారులతో డిప్యూటీ కన్జర్వేటర్ మాధవరావు

జన్నారం, న్యూస్‌టుడే : అటవీశాఖ ప్రధాన కార్యాలయంలో డిప్యూటీ కన్జర్వేటర్‌గా విధులు నిర్వర్తిస్తున్న సిరిపురం మాధవరావు శనివారం కవ్వాల్ పులుల సంరక్షణ కేంద్రంలో పర్యటించారు. ఇక్కడి అందాలను తిలకించి తన కెమెరాలో బంధించారు. నిర్మల్ జిల్లా కేంద్రంలో శుక్రవారం జరిగిన శాఖాపరమైన సమావేశానికి హాజరైన ఆయన రాత్రి జన్నారంలోనే బస చేశారు. శనివారం ఉదయం అడవిలోకి వెళ్లి బైసన్‌కుంట, గోండుగూడ బేస్ క్యాంపు తదితర ప్రాంతాలను ఇక్కడి అటవీశాఖ అధికారులతో కలిసి పర్యటించారు. అనంతరం మంచిర్యాల జిల్లా కేంద్రంలో జరిగిన సమావేశానికి హాజరయ్యారు. డిప్యూటీ రేంజి అధికారి తిరుపతి, సెక్షన్ అధికారులు హనుమంతరావు, కిరణ్మయిజ్యోతి, బీట్ అధికారులు రుబీనా, లాలుబాయి తదితరులు పాల్గొన్నారు.

అపరిచితులకు వివరాలు చెప్పొద్దు

కుంటాల: సైబర్ నేరగాళ్లపై అప్రమత్తంగా ఉండాలని ఏఎస్సైలు దేవ్‌రావు, రాందాస్ సూచించారు. మండలంలోని వెంకూర్‌లో శనివారం అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి బ్యాంకు, ఆధార్ వివరాలు, ఫోన్‌కు వచ్చిన ఓటీపీ చెప్పమంటే తిరస్కరించాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వ్యక్తిగత సమాచారాన్ని ఇతరులతో పంచుకోవద్దని పేర్కొన్నారు. సూచనలు చేస్తూ సందేహాలను నివృత్తి చేశారు.

రాష్ట్ర స్థాయి కళోత్సవ్‌కు విద్యార్థిని ఎంపిక

జన్నారం, న్యూస్‌టుడే : మంచిర్యాల జిల్లా జన్నారం మండల కేంద్రంలోని స్లేట్ హైస్కూల్‌లో తొమ్మిదో తరగతి చదువుతున్న గాజుల సహస్రగౌడ్ రాష్ట్ర స్థాయి కళోత్సవ్ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 16న నిర్వహించిన కళోత్సవ్-2024 గాను జిల్లా స్థాయి కూచిపూడి నృత్యాలలో సహస్ర ఉత్తమ ప్రతిభ కనబరిచారు. నవంబర్ 1న జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో ఆమె పాల్గొంటారు. ఈ మేరకు పాఠశాల నిర్వాహకులు విద్యార్థిని అభినందించారు.


నృత్యం చేస్తున్న సహస్రగౌడ్

సౌత్‌జోన్ అథ్లెటిక్స్‌లో మెరిసిన కార్తిక్

ఆదిలాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే : ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరులో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి సౌత్‌జోన్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా విద్యార్థి మెరిశాడు. ట్రయాథ్లాన్(60మీ., 600మీ.ల పరుగు, లాంగ్‌జంప్) క్రీడాంశంలో బజార్‌హత్నూర్ మండలం జాతర్ల గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలకు చెందిన రాఠోడ్ కార్తిక్ మొదటి స్థానంలో నిలిచి పసిడి పతకం సాధించాడు. ఆయనకు జిల్లా అథ్లెటిక్స్ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అడ్డి భోజారెడ్డి, పి.రాజేశ్, జిల్లా గిరిజన క్రీడల అధికారి పార్థసారథి, పెటా ప్రధాన కార్యదర్శి ఎన్.స్వామి, కోచ్ సునంద్ ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.


రాఠోడ్ కార్తిక్

మేమున్నాం.. మీకు తోడుగా..
(10 AM TO 1 PM)
ఆదిలాబాద్: 91541 18155
ఇచ్చోడ: 94935 57309
బోథ్: 91548 46671
ఉట్నూరు: 94410 86640

న్యూస్‌టుడే, ఇచ్చోడ :
? ఇచ్చోడలోని సుభాష్‌నగర్ కాలనీలో వీధి దీపాలు లేక రాత్రుల్లో తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది. - **స్థానికుడు, ఇచ్చోడ**
✔ పరిశీలించి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం. - **సూర్యప్రకాష్, పంచాయతీ ఈఓ**

న్యూస్‌టుడే, గుడిహత్నూర్ :
? గుడిహత్నూర్ మండల కేంద్రంలోని పలు కాలనీల్లో ఖాళీగా ఉన్న ప్లాట్లలో వ్యర్థాలను తీసుకొచ్చి వేస్తున్నారు. - **కృష్ణ, గుడిహత్నూర్**
✔ ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పరిశీలించి చర్యలు తీసుకుంటాం. - **రాందాస్, పంచాయతీ కార్యదర్శి గుడిహత్నూర్**


న్యూస్‌టుడే, ఆదిలాబాద్ అర్బన్ :
? ఆదిలాబాద్ పట్టణంలోకి ప్రవేశించే వారికి స్వాగతం తెలిపేలా రాంపూర్ వద్ద ఏర్పాటు చేయాల్సిన స్వాగత ద్వారాలు రెండేళ్లుగా ఏర్పాటు చేయడం లేదు. - **రమేశ్, స్థానికుడు**
✔ త్వరలో స్వాగత ద్వారాలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం. - **తిరుపతి, డీఈఈ, బల్దియా**

న్యూస్‌టుడే, ఇచ్చోడ :
? ఇచ్చోడలోని రంజాన్‌పుర కాలనీలో డ్రైనేజీ సరిగా లేక మురుగు రోడ్డుపై చేరి నడవలేని పరిస్థితి నెలకొంది. రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. - **స్థానికుడు, ఇచ్చోడ**
✔ పరిశీలించి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం. - **సూర్యప్రకాష్, పంచాయతీ ఈఓ**

న్యూస్‌టుడే, బజార్‌హత్నూర్ :
? బజార్‌హత్నూర్‌లో శబరిమాత ఆలయం సమీపంలో కరెంటు స్తంభంపై ఇన్సులేటర్ విరిగిపోవడంతో తీగ మరో తీగ మీద పడి ప్రమాదం జరిగే అవకాశం ఉంది. - **తాండ్ర నవీన్, బజార్‌హత్నూర్**
సమాధానం: సమస్యను పరిష్కరించి ప్రమాదం జరగకుండా చూస్తాం. - **విద్యుత్తు శాఖ ఏఈ, శ్రీనివాస్.**

సెనగ రైతుకు 'మద్దతు'

★ రూ.18 కోట్లు లబ్ధి



న్యూస్‌టుడే, ఆదిలాబాద్ వ్యవసాయం : కేంద్రం ప్రకటించిన మద్దతు ధరలు జిల్లా రైతులకు మేలు చేకూర్చేలా ఉన్నాయి. యాసంగిలో సాగయ్యే పంటలలో వరి తరువాత ఎక్కువ విస్తీర్ణంలో సాగయ్యేది సెనగ పంటనే. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలలో శనగ పంటకు క్వింటాలుకు రూ.210 పెంచడంతో జిల్లా రైతులకు రూ.18 కోట్ల మేర ప్రయోజనం చేకూరనుంది.

జిల్లాలో ఏటా సెనగ సాగు లక్ష ఎకరాలు దాటుతోంది. వానాకాలంలో సాధారణం కంటే మించి వర్షపాతం నమోదు కావడంతో వచ్చే యాసంగి సీజన్‌లో 1.10 లక్షల ఎకరాల్లో సెనగ సాగు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. యాసంగి పంటలకు కేంద్రం ప్రకటించిన మద్దతు ధరల్లో సెనగ పంటకు క్వింటాలుకు రూ.210 పెంచారు. దీని వల్ల జిల్లాలో సెనగ పంట సాగు చేసే రైతులు మరింత లబ్ధి పొందనున్నారు.

గోధుమ పంటకు రూ.150 పెంచారు. గోధుమ సాధారణ సాగు 5 వేల హెక్టార్లు కాగా ఈ ఏడాది ఎక్కువ సాగయ్యే వీలుంది. మద్దతు ధర క్వింటాలుకు రూ.2425గా నిర్ణయించారు. నూనెగింజల పంటలో కుసుమ సాగు తక్కువగా ఉంటుంది. ఈ పంట క్వింటాలు ధర రూ.5,940గా నిర్ణయించారు. క్వింటాలుకు రూ.140 పెరిగింది.

సృజనకు పదును.. ప్రతిభకు ప్రోత్సాహం


పరీక్ష రాస్తున్న విద్యార్థులు


విజేతలు సాద్విక, నిధి, సంకీర్తనలకు బహుమతులు అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి, రవి

పాలనాప్రాంగణం, న్యూస్‌టుడే : 'ఈనాడు' ఆధ్వర్యంలో ఆదిలాబాద్ పట్టణం ఎస్ఆర్‌డీజీ హైస్కూల్‌లో 'ఇంటర్నెట్ వినియోగం -విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. 8, 9, 10 తరగతుల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన 10వ తరగతి విద్యార్థిని సామల సాద్విక ప్రథమ, 8వ తరగతి విద్యార్థిని అంబేకర్ నిధి ద్వితీయ, 9వ తరగతి విద్యార్థిని సీహెచ్.సంకీర్తన తృతీయ బహుమతులు సాధించారు. వారికి జోనల్ ఇన్‌ఛార్జి శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపల్ మెట్‌పల్లి రవి ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు.

చరవాణి టవర్ ఏర్పాటుపై అభ్యంతరం

ఆదిలాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : పట్టణంలోని 12వ వార్డు జూబ్లీహిల్స్ కాలనీలో చరవాణి ఏర్పాటుపై శుక్రవారం రాత్రి కాలనీవాసులు అభ్యంతరం వ్యక్తం చేశారు. స్థానిక కౌన్సిలర్ పవన్ నాయక్‌కు చెందిన స్థలంలో టవర్ ఏర్పాటును విరమించుకోవాలని గతంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. జనావాసాల మధ్య ఏర్పాటైతే రేడియేషన్ ప్రభావంతో దుష్పరిణామాలు ఎదురవుతాయని అధికారులు తక్షణమే టవర్ ఏర్పాటును విరమించుకోవాలని కోరారు. లేకపోతే నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు.

నార్నూర్-గాదిగూడ మండలాల అభివృద్ధికి కృషి


సోయా బస్తా తూకం చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి, అధికారులు, ప్రతినిధులు

నార్నూర్, న్యూస్‌టుడే : నార్నూర్-గాదిగూడ మండలాల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తామని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఉప మార్కెట్ యార్డులో ఏర్పాటు చేసిన సోయా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. సోయా క్వింటాలుకు మద్దతు ధర రూ.4,892 పలికితే, ఖర్చులు పోగా రైతుకు మిగిలేది రూ.1892 మాత్రమేనని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఆదిలాబాద్ జిల్లాలో ఈ రెండు మండలాలు ఉన్నప్పటికీ, ఆసిఫాబాద్ నియోజకవర్గానికి చెందడంతో ఈ ప్రాంతవాసుల సమస్యల పరిష్కారంపై దృష్టిసారిస్తానని పేర్కొన్నారు. నార్నూర్ ఉప మార్కెట్ యార్డును ఇంద్రవెల్లి నుంచి వేరు చేసి నార్నూర్-గాదిగూడ లను కలుపుతూ నార్నూర్ ప్రత్యేక మార్కెట్ యార్డు మంజూరుకు ముఖ్యమంత్రితో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని చెప్పారు. రైతులకు అన్ని విధాలా అందుబాటులో ఉండి సేవలందిస్తామన్నారు. కార్యక్రమంలో పీసీసీఎస్ ఇన్‌ఛార్జి ఛైర్మన్ సురేష్ ఆడే, ఏఎంసీ కార్యదర్శి దేవన్న, సహాయకుడు ప్రేమ్‌దర్, సర్పంచుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గజానంద్ నాయక్, పీసీసీఎస్ డైరెక్టర్లు కాంతారావు, మర్సే, కేశవ్, కర్మన్‌కర్, బాలాజీ, మాజీ ఏఎంసీ వైస్ ఛైర్మన్ తొడసం నాగోరావు, ఉర్వేత రూప్‌దేవ్, హస్సుతు, భారాస ప్రధాన కార్యదర్శి సయ్యద్ కాసీమ్ సాబ్, మాజీ ఎంపీపీ, వైస్ ఎంపీపీలు కనక మోతుబాయి, చంద్రశేఖర్ జాదవ్, రైతులు పాల్గొన్నారు.


గెలుపొందిన ఆదిలాబాద్ బ్ల్యూ జట్టు

క్రికెట్ పోటీల విజేత ఆదిలాబాద్ జట్టు

ఆదిలాబాద్ క్రీడావిభాగం, న్యూస్‌టుడే: మంచిర్యాలలో నిర్వహించిన హెచ్‌సీఏ అండర్-23 ఉమ్మడి జిల్లాస్థాయి క్రికెట్ పోటీల్లో ఆదిలాబాద్ బ్ల్యూ జట్టు విజేతగా నిలిచింది. శనివారం జరిగిన తుది పోరులో మంచిర్యాల జట్టుపైన గెలుపొందింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆదిలాబాద్ బ్ల్యూ జట్టు 50 ఓవర్లలో 174 పరుగులు చేసింది. రేహాన్ 52, దర్ష్ అగ్రవాల్ 31 పరుగులు చేసి రాణించారు. లక్ష్య ఛేదనకు దిగిన మంచిర్యాల జట్టు 158 పరుగులు చేసి ఓడింది. సద్దాం 5 వికెట్లు తీసి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. కోచ్‌లు, సీనియర్ క్రీడాకారులు అతవుల్లాఖాన్, అబిద్, విజయ్, గౌతం తదితరులు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


దేవిదాస్

ఆదిలాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే : ఆదిలాబాద్ గ్రామీణ మండలం లోకారికి చెందిన కె.దేవిదాస్(25) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. గ్రామీణ ఎస్సై ముజాహిద్ వివరాల ప్రకారం.. దేవిదాస్ వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 12న రాత్రి ఆదిలాబాద్ నుంచి లోకారికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా.. వాహనం అదుపు తప్పి కిందపడగా గాయపడ్డాడు. ఆతడిని రిమ్స్‌కు తరలించారు. అనంతరం హైదరాబాద్ నిమ్స్‌కు తరలించారు. శనివారం చనిపోయాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

జూదరుల అరెస్టు

ఆదిలాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే : ఆదిలాబాద్ గ్రామీణ మండలం లాండసాంగ్వి శివారులో నిషాన్‌ఘాట్ సమీపంలో జూదమాడుతున్న ఆరుగురిపై కేసు నమోదు చేసినట్లు గ్రామీణ ఎస్సై ముజాహిద్ తెలిపారు. ఆదిలాబాద్ పట్టణానికి చెందిన జూదరుల్లో నలుగురిని అరెస్టు చేయగా.. ఇద్దరు పరారీలో ఉన్నట్లు చెప్పారు.


చిల్కూరి లక్ష్మీనగర్ ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న పుర కమిషనర్ ఎండీ ఖమర్ అహ్మద్

రుచికరమైన భోజనం పెట్టాలి

ఆదిలాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం రుచికరంగా వండి పెట్టాలని బల్దియా కమిషనర్ ఎండీ ఖమర్ అహ్మద్ అన్నారు. శనివారం పట్టణంలోని చిల్కూరి లక్ష్మీనగర్ పాఠశాలను సందర్శించారు. మధ్యాహ్న భోజనం వండుతున్న తీరును, సరకులు, కూరగాయలను పరిశీలించారు.

క్యాన్సర్‌పై అవగాహన ఉంటేనే రక్షణ

ఆదిలాబాద్ వైద్య విభాగం, న్యూస్‌టుడే : క్యాన్సర్ ఎలా వస్తుందో అవగాహన ఉంటే ఆ వ్యాధి బారిన పడకుండా రక్షణ పొందవచ్చని డీఎంహెచ్ఓ కృష్ణ, రిమ్స్ సంచాలకుడు డాక్టర్ రాఠోడ్ జైసింగ్ పేర్కొన్నారు. ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స పొందితే వ్యాధి పూర్తిగా నయమవుతుందన్నారు. పాలియేటివ్ కేర్ వారోత్సవాల ముగింపు కార్యక్రమం సందర్భంగా రిమ్స్‌లోని పాలియేటివ్ కేర్ వార్డులో బాధితులకు వారు పండ్లను పంపిణీ చేశారు. వార్డుకు రాలేని బాధితులకు ఇంటి వద్దనే తమ సిబ్బంది సేవలందిస్తున్నారని తెలిపారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ సాధన, ఎన్‌సీడీ అధికారి మిట్పల్లివార్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

ఐఎఫ్‌టీయూ విలీనంతో మాతృ సంస్థకు సంబంధం లేదు

ఎదులాపురం, న్యూస్‌టుడే : భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఐఎఫ్‌టీయూ)లోని కొందరు రాజకీయ విధానాలతో విభేదిస్తూ టీయూసీఐలో విలీనం కావటంతో మాతృ సంస్థకు ఎలాంటి సంబంధం లేదని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.వెంకటనారాయణ ప్రకటించారు. స్థానిక కుమురం భీం కార్యాలయంలో ఆయన శనివారం మాట్లాడుతూ ఒక వర్గం వారు చేసిన ఈ విలీన ప్రకటన వల్ల సంఘంలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయన్నారు. సంఘం నాయకులు గౌరాల సుభాష్, గంగమ్మ, శ్యాం, సునీత, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.


ఎక్సైజ్ సీఐ విజేందర్‌కు వినతిపత్రం అందజేస్తున్న భాకపా నాయకులు

దేశీదారు నియంత్రించాలి

ఎదులాపురం, న్యూస్‌టుడే : మహారాష్ట్ర నుంచి దేశీదారు, ఇతర మద్యం విచ్చలవిడిగా జిల్లాలోకి వస్తోందని, అరికట్టకపోతే ఉద్యమాలు చేపడతామని భాకపా జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి హెచ్చరించారు. పార్టీ కార్యకర్తలతో కలిసి ఎక్సైజ్ సీఐ విజేందర్‌కు శనివారం వినతి పత్రాన్ని అందజేశారు. జిల్లాలో మద్యం గొలుసు దుకాణాల నిర్వాహకులు మహారాష్ట్ర మద్యాన్ని యథేచ్ఛగా విక్రయిస్తున్నారన్నారు. ఆబ్కారీ అధికారులు ఈ విషయమై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు రాములు, అరుణ్‌కుమార్, షేక్ బాషా, నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

జైలుకు తరలింపు

ఇచ్చోడ, న్యూస్‌టుడే : గుడుంబా విక్రయిస్తూ పట్టుబడి, జరిమానా చెల్లించని వ్యక్తిని జైలుకు తరలించిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. ఇచ్చోడ ఎక్సైజ్ సీఐ జుల్ఫికర్ అహ్మద్ వివరాల ప్రకారం.. ఇచ్చోడ మండలం జల్దా గ్రామానికి చెందిన జాదవ్ భీంలాల్ పలుమార్లు గుడుంబా విక్రయిస్తూ పట్టుబడ్డాడు. తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేయగా, రూ.లక్ష జరిమానా విధించారు. సకాలంలో జరిమానా చెల్లించకపోవడంతో అదుపులోకి తీసుకొని శనివారం ఒక సంవత్సరం రిమాండ్‌కు జిల్లా జైలుకు తరలించినట్లు ఆయన తెలిపారు. సిబ్బంది బాపురావు, మౌనిక, సంధ్య తదితరులు ఉన్నారు.

బూటకపు హామీలతో మోసం

ఆదిలాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : కాంగ్రెస్ పార్టీ బూటకపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి ప్రజలను మోసం చేస్తోందని పురపాలక అధ్యక్షుడు జోగు ప్రేమేందర్ విమర్శించారు. శనివారం భాగ్యనగర్, దివ్యాంగుల కాలనీ, బెల్లూరి, విద్యానగర్ కాలనీల్లో తిరుగుతూ ఈ నెల 24న భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ హాజరయ్యే సభను విజయవంతం చేయాలని కోరారు. పార్టీ నాయకులు వార్డుల్లో తిరుగుతూ సభను విజయవంతం చేయాలని కోరారు. కౌన్సిలర్లు అశోక్‌స్వామి, పందిరి భూమన్న, కోవ రవి, నాయకులు పండ్ల శ్రీనివాస్, దమ్మపాల్, సాయి తదితరులున్నారు.


ప్రచార ప్రతులను ఆవిష్కరిస్తున్న పుర అధ్యక్షుడు ప్రేమేందర్

గంగపుత్రుల సమస్యలు పరిష్కరించండి

ఆదిలాబాద్ అర్బన్, న్యూస్‌టుడే : గంగపుత్రులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ మత్స్యకార సమాఖ్య అధ్యక్షుడు గుడిపెల్లి నగేష్ కోరారు. శనివారం నిర్మల్ జిల్లాకు వచ్చిన మత్స్యకార సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు సాయికుమార్‌ను కలిసి సన్మానించారు. ఆదిలాబాద్‌లోని ఖానాపూర్ చెరువులో గుర్రపు డెక్క తొలగించాలని, ఎకరం స్థలం ఉన్న మత్స్యకారులకు రాయితీపై చేపపిల్లలను పంపిణీ చేయాలని, గంగపుత్ర సంఘం భవనానికి స్థలం కేటాయించాలని విన్నవించారు. నాయకులు పర్రె యాదగిరి, యువరాజ్, హరి తదితరులున్నారు.

కేటీఆర్ సభా ఏర్పాట్ల పరిశీలన

ఆదిలాబాద్ పట్టణం, న్యూస్‌టుడే : భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఈ నెల 24న ఆదిలాబాద్ రానుండటంతో పట్టణంలోని రాంలీలా మైదానంలో సభా ఏర్పాట్లు చేస్తున్నారు. పార్టీ నాయకులు శనివారం సభ నిర్వహించే ప్రాంగణాన్ని పరిశీలించారు. సభకు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని వసతులు కల్పించనున్నట్లు తెలిపారు. పార్టీ నాయకులు యూనుస్ అక్బానీ, సాజిదొద్దీన్, కౌన్సిలర్ పవన్‌నాయక్, జిల్లా ఉపాధ్యక్షుడు నారాయణ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సత్కారం

భీంపూర్, న్యూస్‌టుడే: భీంపూర్ ఉన్నత పాఠశాలకు కొత్తగా వచ్చిన టీచర్లను గ్రామస్థులు శనివారం ఘనంగా సన్మానించారు. విద్యార్థుల భవితకు బాటలు వేయాలని ఆకాంక్షించారు. మాజీ సర్పంచులు లింబాజీ, ధరమ్ సింగ్, గ్రామపెద్దలు పురుషోత్తం, ఉత్తమ్, రవీందర్, సంజీవ్, విద్యార్థుల పోషకులు పాల్గొన్నారు.

స్వచ్ఛత పాటించకుంటే చర్యలు

బేల: హోటళ్లు, బేకరీలు, పానీపూరీ విక్రేతలు విధిగా స్వచ్ఛత పాటించాలని తహసీల్దార్, బేల పంచాయతీ ప్రత్యేకాధికారి కె.రఘునాథ్‌రావు అన్నారు. శనివారం పంచాయతీ కార్యాలయంలో యజమానులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి సూచనలు చేశారు.

వెళ్లిరా.. బతుకమ్మ


బతుకమ్మ ఆడుతున్న మాజీ మంత్రి జోగు రామన్న సతీమణి రమాదేవి


అంతర్గాంలో పెన్‌గంగ నది తీరంలో..


జందాపూర్‌లో..

ఆదిలాబాద్ సాంస్కృతికం, ఆదిలాబాద్ గ్రామీణం, భీంపూర్, తలమడుగు, తాంసి, న్యూస్‌టుడే : బతుకమ్మ సంబరాలు జిల్లాలో శనివారం ముగిశాయి. మహిళలంతా రంగురంగుల పూలతో బతుకమ్మను తయారు చేసి ఉత్సాహంగా ఆడిపాడారు. అనంతరం స్థానిక వాగులు, నదులు, చెరువుల్లో బతుకమ్మను నిమజ్జనం చేశారు. వెళ్లిరావమ్మా అంటూ మొక్కారు.


దేవాపూర్‌లో బతుకమ్మ నిమజ్జనానికి వెళ్తున్న మహిళలు


కప్పర్లలో బతుకమ్మలతో శోభాయాత్ర

కుమురం భీం స్ఫూర్తితో ముందుకెళ్లాలి


కల్లూరుగూడలో స్థానికులతో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఉట్నూరు గ్రామీణం, న్యూస్‌టుడే : నిజాం పాలకులతో పోరాడి మనకు హక్కులు, చట్టాలు కల్పించిన కుమురం భీం స్ఫూర్తి, ప్రజల ఆశీర్వాదంతో శాసనసభ్యుడిగా గెలిచానని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. శనివారం ఉట్నూరు మండలం ఎమ్మెల్యే స్వగ్రామం కల్లూరుగూడలో కుమురం భీం వర్ధంతిని నిర్వహించారు. నాయకులు ఖయ్యూం, ప్రభాకర్‌రెడ్డి, తిరుపతి, జగదీష్, జైవంత్‌రావు, రాజాగౌడ్, ఖలీం, అన్సారీ, నందం, లాజర్, రాజేశ్వర్, గ్రామ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

హిందూ సంఘాల నిరసన

ఆదిలాబాద్ సాంస్కృతికం, న్యూస్‌టుడే : ఇటీవల సికింద్రాబాద్ ముత్యాలమ్మ ఆలయంలోని విగ్రహాన్ని కొందరు దుండగులు ధ్వంసం చేసిన ఘటనను తీవ్రంగా ఖండిస్తూ హిందూ సంఘాలు విశ్వ హిందూ పరిషత్, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. శనివారం జిల్లా కేంద్రంలోని శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠం ప్రధాన ద్వారం వద్ద మఠాధిపతి యోగానంద సరస్వతి సమక్షంలో అమ్మవారి చిత్ర పటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాలనాధికారి రాజర్షిషాను కలిసి వినతిపత్రం సమర్పించారు. నాయకులు సంతోష్, ఠాకూర్ సంతోష్, శ్రీరాంశర్మ, దిలీప్ వైద్య, దశరథ్ పటేల్, నారాయణ, నవీన్, ప్రశాంత్, స్వప్న, దినేశ్ ఉన్నారు.


మఠాధిపతి యోగానంద సరస్వతి సమక్షంలో శ్రీరాముడి చిత్రపటం, అమ్మవారి విగ్రహానికి పూజలు చేస్తున్న విశ్వ హిందూ పరిషత్, బజరంగ్ దళ్ నాయకులు

సంక్షిప్త సమాచారం

విద్యాప్రమాణాలు పెంచేందుకు కృషి

బేల, న్యూస్‌టుడే : పోటీ ప్రపంచంలో నెగ్గి ఉపాధ్యాయ వృత్తిలో అడుగుపెట్టారని, అదే స్ఫూర్తితో పాఠశాలల్లో విద్యాప్రమాణాలు పెంచేందుకు కృషి చేయాలని ఎంఈఓ కోల నర్సింహులు ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలో కొత్తగా చేరిన 28 ఉపాధ్యాయులతో శనివారం బేల ప్రాథమిక పాఠశాలలో సమావేశం నిర్వహించారు. పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి టీఎన్.స్వామి, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దేవిదాస్, నితిన్, ఎమ్మార్సీ, సీఆర్పీ సిబ్బంది పాల్గొన్నారు.

టీఎస్ఈఈయూ అదనపు ప్రధాన కార్యదర్శిగా మొహసీన్‌ఖాన్

ఎదులాపురం: ఐఎన్‌టీయూసీ అనుబంధ టీఎస్ఈఈయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శిగా ఆదిలాబాద్‌కు చెందిన విద్యుత్తు సబ్ స్టేషన్ ఆపరేటర్ మొహసీన్‌ఖాన్ నియమితులయ్యారు. రాష్ట్ర కార్మిక విభాగం ఛైర్మన్ ప్రకాష్‌గౌడ్ ఈ మేరకు నియామక ఉత్తర్వులు జారీ చేశారు. పలువురు అభినందించి సన్మానించారు.

సంచార జాతుల ఉన్నతికి సమావేశం

ఆదిలాబాద్ అర్బన్: సంచార జాతుల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై సలహాలు, సూచనలు ఇచ్చేందుకు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు జిల్లా బీసీ సంక్షేమాధికారి రాజలింగు ఒక ప్రకటనలో తెలిపారు. 22న జిల్లా కేంద్రంలోని బీసీ సంక్షేమశాఖ అధికారి కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

గూడలో సంబరాలు

బేల: మండలంలోని గూడలో పలు అభివృద్ధి పనులకు ఎస్డీఎఫ్ నిధులు మంజూరు కావడంతో శనివారం కాంగ్రెస్ నాయకులు సంబరాలు నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి, ఇన్‌ఛార్జి మంత్రి సీతక్క, నియోజకవర్గ ఇన్‌ఛార్జి కంది శ్రీనివాస్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కిసాన్ సెల్ మండలం అధ్యక్షుడు ఘన్‌శ్యాం, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అవినాష్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పాత్రికేయుడిపై దాడి చేసిన వారిని శిక్షించాలి

బోథ్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పాత్రికేయుడు సుదర్శన్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని బోథ్ ప్రెస్‌క్లబ్ సభ్యులు డిమాండ్ చేశారు. బోథ్ తహసీల్దార్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ మురళికి వినతిపత్రం అందజేశారు. గంగన్న, గంగాధర్, రమణాగౌడ్, సంతోష్, నవీన్, షేక్ అలీ పాల్గొన్నారు.

గుడిహత్నూర్‌లో బంద్ ప్రశాంతం

గుడిహత్నూర్: మహ్మద్ ప్రవక్తపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని ముస్లిం ఐకాస నాయకులు డిమాండ్ చేస్తూ శనివారం మండల కేంద్రంలో బంద్ నిర్వహించారు. వ్యాపారులు తమ దుకాణాలను మూసి ఉంచారు.

ముగిసిన కానిస్టేబుల్ శిక్షణ అభ్యర్థుల పరీక్షలు

ఆదిలాబాద్ నేర విభాగం: ఆదిలాబాద్ డీటీసీ కేంద్రంలో నాలుగు రోజులుగా కొనసాగుతున్న కానిస్టేబుల్ శిక్షణ అభ్యర్థుల పరీక్షలు శనివారంతో ముగిశాయి. డీటీసీ కేంద్రం ప్రిన్సిపల్ సమయ్‌జాన్‌రావు ఆధ్వర్యంలో జరిగిన పరీక్షలను శనివారం నిజామాబాద్ నుంచి పర్యవేక్షకుడిగా వచ్చిన డీఎస్పీ సయ్యద్ మస్తాన్ అలీ పరిశీలించారు.

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

ఆదిలాబాద్ గ్రామీణం: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలులో విఫలమైందని భారాస జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. ఆదిలాబాద్ గ్రామీణ మండలం ఖండాల, అంకాపూర్ గ్రామాల్లో పార్టీ నాయకుల సమావేశంలో మాట్లాడారు.

ఓటు నమోదుపై పీఆర్‌టీయూ ప్రచారం

భీంపూర్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై పీఆర్‌టీయూ ముందడుగు వేసింది. శనివారం భీంపూర్ మండలంలోని పాఠశాలలను నాయకులు సందర్శించారు. సంఘం జిల్లా అధ్యక్షుడు కొమ్ము కృష్ణకుమార్ మాట్లాడుతూ అర్హత కలిగిన ఉపాధ్యాయులంతా నవంబరు 6లోగా ఓటు నమోదు చేసుకోవాలని కోరారు.

రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ఆదిలాబాద్ క్రీడావిభాగం: పాఠశాల క్రీడా సమాఖ్య(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో మంచిర్యాలలోని నస్పూర్‌లో నిర్వహించిన జోనల్‌స్థాయి కరాటే పోటీల్లో జిల్లాకు చెందిన బాలబాలికలు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. అండర్-14 బాలికల్లో వై.కాజల్(30 కిలోలు), బి.హారిక(38 కిలోలు), బాలురుల్లో జి.విశ్వజిత్(52 కిలోలు), అండర్-17 బాలికల్లో జి.అనుష్క(58 కిలోలు), జి.స్వాతిసృష్టి(52 కిలోలు), బాలురుల్లో ఎం.డి.షఫాన్(45 కిలోలు), హెచ్.నయన్(51 కిలోలు), అండర్-19 విభాగంలో పి.అభిజిత్(58 కిలోలు), బి.భావనేశ్(50 కిలోలు) రాష్ట్రస్థాయి కరాటే పోటీలకు ఎంపికయ్యారు. వీరిని ఎస్‌జీఎఫ్ కార్యదర్శి కాంతారావు, జిల్లా స్పోర్ట్స్ కరాటే డు అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ముకేశ్‌కుమార్, జి.ప్రవీణ్‌కుమార్, కోశాధికారి ఆకాశ్ అభినందించారు.


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన బాలబాలికలు


గోడప్రతులను ఆవిష్కరిస్తున్న ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా

ఆదివాసీల సంస్కృతి ఎంతో గొప్పది

ఉట్నూరు, న్యూస్‌టుడే : ఆదివాసీల సంస్కృతి ఎంతో గొప్పదని ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా పేర్కొన్నారు. శనివారం ఉట్నూరులో దండారీ ఉత్సవాల గోడప్రతులను పీవో ఆవిష్కరించారు. పీవో మాట్లాడుతూ.. బోలిచేతో ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 25 నుంచి నవంబరు 10 వరకు ఆన్‌లైన్‌లో దండారీ ఉత్సవాల ఫొటో పోటీలను నిర్వహిస్తున్నామన్నారు. పోటీలలో ఎంపికైన ఫొటోలను వికిపీడియాలో పొందుపరుస్తామన్నారు. ఉమ్మడి జిల్లా నుంచి ఆసక్తి కలిగిన యువత ఈ పోటీలలో పాల్గొని బహుమతులు గెల్చుకోవాలన్నారు. బోలిచేతో ఫౌండేషన్ బోర్డు సభ్యుడు ఆత్రం మోతీరాం, సిడాం కిషన్, వరప్రసాద్, టేకం వసంత్, ముకుంద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన మంచి నీటి సహాయకుల శిక్షణ

బేల, న్యూస్‌టుడే : మిషన్ భగీరథ్ శాఖ ఆధ్వర్యంలో ఎంపీడీఓ సమావేశ మందిరంలో గ్రామ మంచి నీటి సహాయకులకు నిర్వహిస్తున్న శిక్షణ శిబిరం శనివారం ముగిసింది. శిక్షణకు ఆ శాఖ ఎస్ఈ సురేష్ హాజరై మాట్లాడారు. ధ్రువపత్రాలను అందజేశారు. ప్రత్యేకాధికారి మనోహర్, ఎంపీడీఓ మహేందర్, ఏఈ శాంతికుమార్ పాల్గొన్నారు.